# బాలల హక్కులను పరిరక్షించాలి

● రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు పానుగోటి అంజన్‌రావు

మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు అంజన్‌రావు

నాంపల్లి, మార్చి 18 : బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందాని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు పానుగోటి అంజన్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గాంధీజీ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ ఆపదలో ఉన్న చిన్నారులను కాపాడేందకు జిల్లా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 పని చేస్తుందని తెలిపారు. బాలల హక్కులను హరిస్తే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. విద్యార్థులు స్వేచ్ఛాయుత వాతావరణంలో చదివి ఉన్నత స్థానంలో నిలువాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎన్‌సీఈఆర్డీ సభ్యుడు సయ్యద్ మతిన్ అహ్మద్, ఎంఈఓ గురువారావు, గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ బంధనాథం, భాస్కర్, వెంకన్న, నాగరాజు, సురేశ్ పాల్గొన్నారు.

# విద్యార్థి నాయకుడు నర్సింహకు ఓయూ డాక్టరేట్

మాడుగుల నర్సింహ

మాడ్గులపల్లి, మార్చి 18 : మలిదశ తెలంగాణ ఉద్యమ విద్యార్థి నాయకుడు, పేదరికాన్ని జయించి సామాజిక, సాంస్కృతిక, ప్రాంతీయ, రాజకీయ అసమానతలను అవపోసాన పట్టిన మాడుగుల నర్సింహకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. మాడ్గులపల్లి మండల కేంద్రానికి చెందిన నర్సింహ ప్రాథమిక విద్యాభ్యాసం మాడ్గులపల్లిలో, ఇంటర్మీడియట్, డిగ్రీ మిర్యాలగూడలో, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేసి.. గేట్, సీఎస్ఐఆర్ ఫెలోషిప్ సాధించి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ హైదరాబాద్ ప్రిన్సిపల్, సైంటిస్ట్ డాక్టర్ వెంకటనర్సయ్య పర్యవేక్షణలో 'స్టీరియో సెలక్టివ్ సింథసిస్ ఆఫ్ లింగ్విక్ యాసిడ్ డెరివేటివ్స్, సినకాల్ సెట్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ సింథటిక్ మెథడాలజీస్' అనే అంశంపై పరిశోధన చేసి సమర్పించిన గ్రంథాన్ని పరిశీలించిన అధికారులు నర్సింహకు పీహెచ్‌డీ పట్టా అందజేయనున్నట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. నర్సంహ విద్యార్థి దశ నుంచే చదువులో ముందుండేవాడు. బహుజన ఉద్యమాల్లోనూ, మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ చురుకుగా పాల్గొన్నాడు. తాను చదువుకుంటూనే ఎంతో మంది పేద విద్యార్థులకు సాయం చేస్తూ భవిష్యత్ నాయకులు, అధికారులను తయారు చేస్తున్న మానవతావాది. నర్సింహకు డాక్టరేట్ రావడంపై బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, ఐఆర్ఎస్ అధికారి నాగరాజు, గ్రామస్తులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.

# ఎన్నికల బాండ్ల వివరాలను సుప్రీంకోర్టుకు సమర్పించాలి

● వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఐలయ్య

సమావేశంలో మాట్లాడుతున్న ఐలయ్య

దామరచర్ల, మార్చి 18 : ఎలక్టోరల్ బాండ్ల వివరాలను సమర్పించాలని సుప్రీంకోర్టు ఎస్‌బీఐని ఆదేశించినా ఇంతవరకూ అమలు చేయకపోవడం విచారకరమని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య అన్నారు. మండలంలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్‌బీఐ ప్రజల బ్యాంక్‌లా కాకుండా బీజేపీ బ్యాంక్‌లా వ్యవహరిస్తున్నదన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను సైతం ఎస్‌బీఐ బేఖాతర్ చేయడం క్షమించరాని నేరమన్నారు. బీజేపీ అన్ని వ్యవస్థలను తన గుప్పెట్లో పెట్టుకున్నట్లు ఎస్‌బీఐని కూడా పెట్టుకున్నట్లు కనిపిస్తుందన్నారు. ఎన్నికల బాండ్ల పేరున బీజేపీ లక్షల కోట్లు వసూలు చేసిందని, బీజేపీ బండారం బయటపడుతుందని బాండ్ల వివరాలు వెల్లడించకుండా ఒత్తిడి చేస్తుందన్నారు. బీజేపీ పాలనలో దగాపడ్డ కార్మిక, కర్షక, బడుగు వర్గాలు పార్లమెంటు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చినవెంకులు, రాష్ట్ర కమిటీ సభ్యుడు పిల్లుట్ల వెంకటసైదులు, మండల కార్యదర్శి హనుమంతు, సీఐటీయూ మండల కార్యదర్శి దయానంద్, నాయకులు బాలసైదులు, శ్రీనివాస్, వెంకన్న ఖాజామొయినుద్దీన్ పాల్గొన్నారు.

# ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

వలంటీర్లకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ భిక్షమయ్య

మిర్యాలగూడ, మార్చి 18 : కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో మండలంలోని కొత్తగూడెంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న శీతాకాలపు శిబిరం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ భిక్షమయ్య మాట్లాడుతూ.. వారం రోజులుగా వలంటీర్లు గ్రామంలోని వీధులు, పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేయడంతోపాటు గ్రామ పంచాయతీ పరిధిలో కంపచెట్లను తొలగించినట్లు తెలిపారు. అలాగే ఓటర్లకు ఓటు హక్కుపై అవగాహన, విద్య, ఉపాధి లేని యువతపై సర్వే చేసినట్లు తెలిపారు. అనంతరం వలంటీర్లకు ప్రశంసాపత్రాలు అందించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ నరేందర్‌రెడ్డి, ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ రాంరెడ్డి, పీడీ ఫ్రాన్సిస్, ఎగ్జామినేషన్ కో ఆర్డినేటర్ నరేశ్, విఘ్నేశ్, లోకేశ్, అంజిబాబు, వంశీ, మౌనిక, అశ్విన్, శాంతి పాల్గొన్నారు.

# శాలిగౌరారం ఎస్ఐగా ప్రవీణ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

శాలిగౌరారం, మార్చి 18 : శాలిగౌరారం నూతన ఎస్ఐగా ప్రవీణ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇప్పటి వరకు విధులు నిర్వహించిన ఎస్ఐ ఐలయ్య నల్లగొండ సీసీఎస్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో నల్లగొండ సీసీఎస్ నుంచి ప్రవీణ్‌కుమార్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

# రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని వినతి

చిట్యాల, మార్చి 18 : మండలంలోని వెల్మినేడులో ఎండిన పొలాలను రైతు సంఘం నాయకులు సోమవారం పరిశీలించారు. అనంతరం రైతులకు నష్టపరిహారం అందించాడుకోవాలని తాసీల్దార్‌కు వినతిప్రతం అందజేశారు. కార్యక్రమంలో రైతుసంఘం, సీపీఎం నాయకులు బొంతల చంద్రారెడ్డి, బండ శ్రీశైలం, ఐతరాజు నర్సింహ, అరూరి శ్రీను, రాజయ్య, రాములు, స్వరూప, శంభయ్య, లింగయ్య పాల్గొన్నారు.

# ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు ప్రారంభం

మిర్యాలగూడ : విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు

నందికొండ : హిల్‌కాలనీ సెయింట్ జోసెఫ్ పాఠశాల వద్ద విద్యార్థులు

నకిరేకల్ : హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

నెట్‌వర్క్ నమస్తే తెలంగాణ, మార్చి 18 : పదో తరగతి పరీక్షలు సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు తెలుగు, సంస్కృతం పరీక్షలు జరిగాయి. పరీక్షకు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను సైతం పరీక్షకు అనుమతించారు. ఉదయం 9:30 నుంచి 12:30 గంటల వరక పరీక్ష జరిగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పరీక్ష జరుగుతున్న సమయంలో జిరాక్స్ సెంటర్లను మూసివేయించారు. మిర్యాలగూడ పట్టణ పరిధి, మండలంలోని 12 పరీక్ష కేంద్రాల్లో 2,662 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 10 మంది గైర్హాజరయ్యారు. ఆయా పరీక్షా కేంద్రాలను ఎంఈఓ బాలాజీనాయక్ తనిఖీ చేశారు. నకిరేకల్ మండల కేంద్రంలో 4 సెంటర్లలో 790 విద్యార్థులకు 788 హాజరైనట్లు అధికారులు తెలిపారు. కేతేపల్లి మండలంలో వందశాతం విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. తిప్పర్తి మండల కేంద్రంలో రెండు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 321 మందికి అందరూ హాజరై పరీక్షలు రాశారు. పెద్దవూర మండల కేంద్రంలోని జడ్పీ హెచ్ఎస్‌లో 240 మందికి 238 మంది, న్యూకిడ్స్‌లో 169 మందికి 169 మంది హాజరయ్యారు. అలాగే నార్కట్‌పల్లి మండలంలో 5 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. జడ్పీహెచ్ఎస్ నార్కట్‌పల్లిలో 179, అమ్మనబోలు-78, బి.వెల్లెంల-80, ఎస్పీఆర్-220, శ్రీ చేతన-139 మొత్తం 696 మంది విద్యార్థులు హాజరయ్యారు. శాలిగౌరారం మండలంలో మొత్తం 337 మందికి అందరూ హాజరైనట్లు ఎంఈఓ నాగయ్య తెలిపారు. నందికొండ మున్సిపాలిటీలోని హిల్‌కాలనీలో గల సెయింట్ జోసెఫ్ పాఠశాలలో 170 మందికి 170, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 139 మందికి 139 మంది పరీక్షకు హాజరైనట్లు పరీక్ష కేంద్రం అధికారులు చెప్పారు. కట్టంగూర్ మండలంలో మూడు కేంద్రాల్లో 425 మందికి 424మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. త్రిపురారం మండలంలో 395 మందికి అందరూ పరీక్ష రాసినట్లు అధికారులు తెలిపారు. హాలియా మండలంలో మొత్తం 725 మంది విద్యార్థులకు గానూ ఇద్దరు విద్యార్థులు గైర్హాజర్ కాగా 723 మంది పరీక్షలు రాసినట్లు ఎంఈఓ లావూరి బాలూ నాయక్ తెలిపారు. దామరచర్ల మండలంలోని మూడు కేంద్రాల్లో 538 మంది పరీక్షలు రాస్తున్నారు. తొలిరోజు ఒక్కరు మాత్రమే గైర్హాజరైనట్లు అధికారులు చెప్పారు. అలాగే అడవిదేవులపల్లి మండలంలో వంద శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ బాలు తెలిపారు. చందంపేట మండలంలో 1,295 మందికి ఐదుగురు గైర్హాజరైనట్లు ఎంఈఓ మాతృనాయక్ తెలిపారు. నేరేడుగొమ్ము మండలంలో 160 మందికి అందరూ హాజరైనట్లు ఎంఈఓ సామ్యనాయక్ చెప్పారు. మునుగుడో మండలంలో 446 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను స్టేట్ పరిశీలకుడు రమణకుమార్ పరిశీలించారు.

# ప్రతి మిల్లు ధాన్యం కొనుగోలు చేయాలి

● మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిల్లర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, మార్చి 18 : మిర్యాలగూడ పట్టణ, మండల పరిధిలోని ప్రతి రైస్ మిల్లులో రైతులు తీసుకొచ్చే ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సూచించారు. సోమవారం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో మిల్లర్లతో సమావేశంలో ఏర్పాటు చేసి మాట్లాడారు. కొన్ని మిల్లుల్లో మాత్రమే ధాన్యాన్ని కొనుగోలు చేస్తుండడంతో రైతులు ఇబ్బంది పడుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే రైతులు వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయారని, వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. సమావేశంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేశ్, మిర్యాలగూడ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, కార్యదర్శి వెంకటరమణచౌదరి, బండారు కుశలయ్య పాల్గొన్నారు.

### ముస్లింలకు రంజాన్ పవిత్రమైనది

ముస్లింలకు రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఇమ్రాన్, వలియుల్లా, కౌన్సిలర్ జావిద్, ఇక్బాల్ పాల్గొన్నారు.

# నానో ఎరువులతో భూసారం పరిరక్షణ

● ఇఫ్కో ఉమ్మడి నల్లగొండ జిల్లా మేనేజర్ వెంకటేశ్

సమావేశంలో మాట్లాడుతున్న ఇఫ్కో ఉమ్మడి నల్లగొండ జిల్లా మేనేజర్ వెంకటేశ్

హాలియా, మార్చి 18 : నానో ఎరువులతో భూసార పరిరక్షణతోపాటు రైతులు అధిక దిగుబడులు సాధించి ఎక్కువ ఆదాయం పొందవచ్చని ఇఫ్కో ఉమ్మడి నల్లగొండ జిల్లా మేనేజర్ ఎ.వెంకటేశ్ అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద సహకార సంస్థ అయిన ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్ కోఆపరేటివ్ లిమిటెడ్ (ఇఫ్కో), రైతు స్వయంకృషి రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో మండలంలోని యాచారం గ్రామంలో సోమవారం మెగా క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువుల అధిక వినియోగంతో నీరు, వాయు కాలుష్యం పెరుగడంతోపాటు భూసారం తగ్గిపోతుందన్నారు. ప్రభుత్వంపై సబ్సిడీ భారం, రైతుల పెట్టుబడి ఖర్చు తగ్గించేందుకు ప్రపంచంలోనే మొదటిసారిగా ఇఫ్కో సంస్థ నానో టెక్నాలజీతో ద్రవ రూపంలో యూరియా, డీఏపీని అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. నానో యూరియా, నానో డీఏపీ వాడకంతో భూమికి, పర్యావరణానికి ఎటువంటి హాని జరుగదని, పైగా 8శాతం దిగుబడి పెరుగుతుందని చెప్పారు. ఇఫ్కో సంస్థ రైతులకు తక్కువ ధరలో ఎరువులు, పురుగు మందులు, సూక్ష్మపోషకాలు అందిస్తుందని చెప్పారు. అదేవిధంగా నానో ఎరువులు, పురుగు మందుల పిచికారీ డ్రోన్లు సైతం ఎఫ్‌పీఓలకు అందజేస్తుందని తెలిపారు. ఇఫ్కో-ఎంసీ జిల్లా ఫీల్డ్ ఆఫీసర్ బి.ఉపేందర్ బత్తాయి తోటల సస్యరక్షణ చర్యలపై వివరించారు. కార్యక్రమంలో ఇఫ్కో ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఎ.భాస్కర్, టి.అఖిల్, గ్రామ మాజీ సర్పంచ్ చెదురుబెల్లి రాములు, రైతు స్వయంకృషి ఎఫ్‌పీఓ డైరెక్టర్లు కాసాని జానయ్య, విమలమ్మ, డి.నర్సింహ, అబ్దుల్ రహీమ్, సీఈఓ నర్సింహ, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# తాగునీటి వృథాకు చెక్

● 'నమస్తే తెలంగాణ' వార్తకు స్పందించిన అధికారులు

పైప్‌లైన్‌కు మరమ్మతు చేపడుతున్న లైన్‌మన్ సైదులు

శాలిగౌరారం, మార్చి 18 : తాగునీటి వృథాకు చెక్ పడేనా? శీర్షికన సోమవారం నమస్తే తెలంగాణ మినీలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఎదురుగా మిషన్ భగీరథ పైపులైన్ లీకై వృథాగా పోతున్న నీటికి అధికారులు చెక్ పెట్టారు. ఆ ఏరియా లైన్‌మన్ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి నీటి వృథాకు అడ్డుకట్ట వేశారు.

# పోలింగ్ కేంద్రాల పరిశీలన

బీరెల్లిగూడెంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ సుబ్రహ్మణ్యం

మునుగోడు, మార్చి18 : మండలంలో కొత్తగా ఏర్పాటు చేయబోయే పోలింగ్ కేంద్రాలైన బీరెల్లిగూడెం130/ఏ, కాశావరిగూడెం128/ఏ, రామకృష్ణాపురం 164/ఏలను చండూరు ఆర్డీఓ సుబ్రహ్మణ్యం సోమవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస అవసరాలైన కరెంట్, ఫర్నిచర్, నీటి వసతులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట తాసీల్దార్ నరేందర్, ఆర్ఐ నాగరాజు ఉన్నారు.

# నాంపల్లిని కరువు మండలంగా ప్రకటించాలి : సీపీఐ

నాంపల్లి, మార్చి 18 : వర్షాలు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్న రైతుల కష్టాలను ప్రభుత్వం గుర్తించి నాంపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అంజాచారి డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో డిప్యూటీ తాసీల్దార్ ఇసాక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిష్టరాంపల్లి, చర్లగూడెం ప్రాజెక్టు పనులను త్వరగా పూర్తి చేసి నాంపల్లి, మర్రిగూడెం రైతులకు తాగు, సాగునీరు అందిచాలన్నారు. పార్టీ మండల కార్యదర్శి సుందనబోయిన రమేశ్, సహాయ కార్యదర్శులు ఊరుపక్క వెంకటయ్య, నేతళ్ల రాజు, కోరె సత్తయ్య, దండిగ వెంకటయ్య, బుషిపాక యాదయ్య, లక్ష్మయ్య, ఇద్దయ్య పాల్గొన్నారు.

# రూ.1.80 లక్షలు పట్టివేత

తిప్పర్తి, మార్చి 18 : నగదు పట్టుబడి కేసు నమోదైన సంఘటన సోమవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. తిప్పర్తి ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాహనాల తనిఖీలో భాగంగా హైదరాబాద్ నుంచి అద్దంకికి కారులో వెళ్తున్న వల్లపు వెంకటేశ్వర్‌రావు వద్ద రూ.1.80 లక్షలు పట్టుబడ్డాయి. ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేసి ట్రెజరీకి పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

# 'రైతు నేస్తం' ప్రసారాన్ని వినియోగించుకోవాలి : ఏఓ

నకిరేకల్, మార్చి 18 : ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలతో నిర్వహించనున్న వీడియో కాన్ఫరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ ఏఓ జానీమియా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరిలో పాటించాల్సిన మెళకువలు, పామాయిల్ సాగు, వేసవిలో కూరగాయల సస్యరక్షణ, మందుల వాడకంపై ఉదయం 10 గంటల నుంచి 11:30 గంటల వరకు శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

# పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

● జిల్లా వ్యాప్తంగా పోషణ్ పక్వాడా పక్షోత్సవాలు

నీలగిరి : సదస్సులో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పార్వతి

నీలగిరి, మార్చి 18 : పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి అన్నారు.పీచు పదార్థాలను తీసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చని తెలిపారు. సోమవారం చర్లపల్లి సెక్టార్ పరిధిలోని రవీంద్రనగర్, బీట్ మార్కెట్ అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో రవీంద్రనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్షోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బాలింతలు, గర్భిణులకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రజిత, సావిత్రమ్మ ఆయాజ్యోతి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

మిర్యాలగూడ : పట్టణంలోని సీతారాంపురం సెక్టార్-2 అంగన్‌వాడీ సెంటర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ మాట్లాడుతూ పీచు పదార్థాల్లో పోషక విలువలు అధికంగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు షబానా, షహీన్, గౌసియా, ఆయాలు, గర్భిణులు పాల్గొన్నారు.

మాడ్గులపల్లి : చిరుధాన్యాలపై అవగాహన కలిగి ఉండాలని అంగన్‌వాడీ టీచర్ లెంకల కల్పన అన్నారు. సోమవారం మండలంలోని అంగన్‌వాడీలో బాలింతలు, గర్భిణులకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, చిన్నారులు పాల్గొన్నారు.

హాలియా : అనుముల మండలంలోని పేరూరు, పంగవానికుంటలో పోషణ్ పక్వాడ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వేజర్ రమాదేవి, అంగన్‌వాడి టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నందికొండ : నందికొండ మున్సిపాలిటీ పైలాన్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు, కిశోర బాలికలకు తృణధాన్యాలు, ఆకుకూరల్లో పోషక విలువలు, ఆహారపు అలవాట్లు, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్ర సూపర్‌వైజర్ వెంకాయమ్మ, టీచర్లు పాల్గొన్నారు.

తిరుమలగిరి : మండలంలోని రాజవరం, ఎల్లాపురంతండాలో కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

# గంగమ్మకు ఎమ్మెల్సీ కోటిరెడ్డి పూజలు

గంగమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

తిరుమలగిరి(సాగర్), మార్చి 18 : మండలంలోని బోయగూడెంలో వెలసిన గంగమ్మతల్లిని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి గ్రామస్తులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు ఎమ్మెల్సీ కోటిరెడ్డి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అల్లిపెద్ది రాజుయాదవ్, మాజీ సర్పంచ్ నెమలి కృష్ణారెడ్డి, యాదవ సంఘం నాయకులు చల్లా కోటేశ్‌యాదవ్, పొదిల వెంకన్న, రైతుబంధు సమితి మాజీ మండలాధ్యక్షుడు కున్‌రెడ్డి లింగారెడ్డి, మాలె సత్యం రెడ్డి, నాయుకలు పొదిల మల్లయ్య, చల్లా మురళి. కృష్ణ, మట్టయ్య, వెంకటయ్య, శ్రీను, శివ, శంకర్, కోటేశ్, మధు, రామలింగయ్య, దుర్గయ్య పాల్గొన్నారు.

# దొడ్ల డెయిరీకి జాతీయ భద్రత అవార్డు

అవార్డు స్వీకరిస్తున్న కంపెనీ ప్రతినిధి

చిట్యాల, మార్చి 18 : సరైన భద్రతా నియమాలు పాటించినందుకు దొడ్ల డెయిరీ గుండ్రాంపల్లి యూనిట్‌కు జాతీయ భద్రత అవార్డు లభించినట్లు ఆ సంస్థ మానవ వనరుల విభాగం జనరల్ మేనేజర్(హెచ్ఆర్) మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సోమవారం యూనిట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జాతీయ భద్రత మండలి 2023 సంవత్సరానికి గానూ దేశంలో వివిధ పరిశ్రమలను పరిశీలించి దొడ్ల డెయిరీ పరిశ్రమకు ఈ అవార్డు ప్రకటించి ఈ నెల 15న హైదరాబాదులో అందజేసినట్లు తెలిపారు. తమ సంస్థకు జాతీయ స్థాయిలో అవార్డు రావడం గర్వంగా ఉందని, భద్రత విషయంలో మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు. సమావేశంలో ప్లాంట్ మేనేజర్ రజినికుమార్, రీజినల్ హెచ్ఆర్ మేనేజర్ సత్యనారాయణ, భద్రత అధికారి ఆనంద రావు పాల్గొన్నారు.

# ఐసీసీఎఫ్‌లో విజేత కళాశాల విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ ధనుంజయ, అధ్యాపకులు

మిర్యాలగూడ, మార్చి 18 : మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఈ నెల 16న తెలంగాణ కామర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్ కాలేజ్ కామర్స్ ఫెస్ట్‌లో యూనివర్సిటీ లెవల్‌లో పట్టణంలోని విజేత కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ తెడ్ల ధనుంజయ సోమవారం తెలిపారు. ఆయా విభాగాల్లో వై.లక్ష్మీప్రసన్న, అర్చన ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. అలాగే ఇటీవల వెలువడిన సెమిస్టర్ ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన ఎస్‌కే కౌసర్, వై.లక్ష్మీప్రసన్నను ఆయన అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.మధు, ప్రభాకర్, జ్యోతి, సంధ